RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 285 | 6 ఆదివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## గుంటూరు బాలిక మిస్సింగ్ కేసు ఛేదన: నిందితుడి అరెస్ట్!



**రాజధాని వాయిస్ గుంటూరు, సెప్టెంబర్ 05:** జిల్లాలో సంచలనం సృష్టించిన పదో తరగతి బాలిక మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జూన్ 10న నమోదైన ఈ కేసుకు సంబంధించి వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియాకు వెల్లడించారు. 'బాధితురాలు బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి.. షేక్ జాన్ సైదాతో కలిసి పారిపోయినట్లు విచారణలో తేలింది. గుంటూరు నుంచి నెల్లూరు, కోయంబత్తూరు, పాలక్కాడ్ మీదుగా సికింద్రాబాద్ వరకు వీరు ప్రయాణించారు. నిందితుడు ఎప్పటికప్పుడు సిమ్ కార్డులు మారుస్తూ తప్పించుకుని తిరిగాడు. అయినప్పటికీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించారు' అని ఎస్పీ తెలిపారు.'బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో 24 గంటల్లోగా వారిని పట్టుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు నాలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా గాలించాయి. చివరకు నిందితుడి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చేసిన ఒక మిస్డ్ కాల్‌ను ఆధారంగా చేసుకుని పోలీసులు వారు ఉండే ప్రాంతాన్ని కనుగొన్నారు. హరియాణాలోని కర్నాల్‌లో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు' అని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు.'ఈ కేసులో నిందితుడిపై కిడ్నాప్, పోక్సో (POCSO) చట్టం కింద కేసులు నమోదు చేశాము. గత రెండేళ్లుగా వీరిద్దరి మధ్య శారీరక సంబంధం ఉంది. ఈ విషయం ఇరు కుటుంబాలకూ తెలుసు. ముఖ్యంగా నిందితుడి తల్లి, సోదరి ఈ వ్యవహారాన్ని ప్రోత్సహించినట్లు తేలడంతో వారిని కూడా నిందితులుగా చేర్చారు. మొదటి నుంచి పక్కాగా దర్యాప్తు చేయడం వల్లే నిందితులను త్వరగా పట్టుకోగలిగాము' అని ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు.

## సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు: సీఎం చంద్రబాబు




**రాజధాని వాయిస్ విజయవాడ, సెప్టెంబర్ 5 :** సాంకేతికత ఎంత పెరిగి నా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులంతా ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లేనని చెప్పారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు. "1991 నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పోటీతో పాటు అవకాశాలు పెరిగాయి. టెక్నాలజీతో మంచి చెడు రెండూ ఉన్నాయి. నేటి కాలంలో బోధనా విధానం పూర్తిగా మారింది. మా చిన్నప్పుడు టీచర్లు బాగా కొట్టేవారు. భయభక్తులతో చదువుకునే వాళ్లం. టీచర్‌తో దెబ్బలు తిన్నవారంతా బాగుపడతారు. పిల్లల మానసిక స్థితి మారుతోంది.. టీచర్లు గమనించాలి. మారుతున్న సాంకేతికత పిల్లలపై పెను ప్రభావం చూపిస్తోంది. సామాజిక మాధ్యమాలు పిల్లలకు శాపంగా మారాయి. పిల్లల్లో కుటుంబ విలువలు, నైతిక ప్రవర్తన పెంపుపై టీచర్లు దృష్టి పెట్టాలి.

**టీచర్లు గౌరవంగా జీవించాలి**

అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచుతున్నాం. బడి పరిసరాలు పచ్చగా ఉండాలి.. అప్పుడే పిల్లలకు మంచి ఆలోచనలు వస్తాయి. బడిలో పచ్చదనం పెరిగేలా టీచర్లు చర్యలు తీసుకోవాలి. తెదేపా అధికారంలో ఉండగా 14 డీఎస్సీలు చేపట్టాం. టీచర్లు గౌరవంగా జీవించాలి.. రాజకీయ నేతల చుట్టూ తిరగకూడదు. ప్రతిభావంతులైన టీచర్లను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం. టెలికామ్, ఐటీ గురించి ముందే ఊహించా.. ఈ విషయం అప్పటి ప్రధానికి చెప్పా. ఆనాడు మేం వేసిన పునాది వల్లే హైదరాబాద్ రూపురేఖలు మారాయి. ఇప్పుడు ఏ దేశానికి వెళ్లినా మన తెలుగువాళ్లు కనిపిస్తారు. విదేశాల్లో ఎక్కువ సంపాదించేది కూడా తెలుగువాళ్లే. టెక్నాలజీని వాడుకుంటేనే అందరికంటే ముందుకెళ్లగలం. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు, డ్రోన్లు, రోబోటిక్స్ వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు.

## జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా కమాండర్‌ను జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. కొంతకాలంగా ఉగ్రవాది యాసిర్ కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు శుక్రవారం యూస్‌మార్గ్‌లో అతడిని గుర్తించాయి. ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు.శుక్రవారం యూస్‌మార్గ్‌లోని పర్వత ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన భద్రతా బలగాలపై ఓ ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో కొనసాగిన ఎదురు కాల్పుల్లో అతడు మరణించాడు. హతమైన ఉగ్రవాదిని యాసిర్‌గా గుర్తించినట్లు శనివారం కశ్మీర్ పోలీసులు వెల్లడించారు. యాసిర్ గతంలో లష్కరే తయ్యిబాకు చెందిన ఓ ఉగ్రముఠాలో సభ్యుడిగా ఉండేవాడు. ఏడాది క్రితం ఆ బృందం నుంచి విడిపోయి, స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు లష్కరే ఉగ్రవాదులతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఉగ్రవాదుల ఫొటోలో యాసిర్ కూడా ఉండడం గమనార్హం. దీంతో కొంత కాలంగా అతడి కదలికలపై భద్రతా బలగాలు నిఘా ఉంచాయి.

మే 2024లో పూంఛ్‌లో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై దాడి.. అదే ఏడాది అక్టోబరులో సోనామార్గ్ సమీపంలో కార్మికులపై దాడి, 2024 డిసెంబర్‌లో బోటా పత్రిలో సైన్యంపై దాడి వంటి ఘటనల్లో అతడి ప్రమేయం ఉంది. పూంఛ్ నుంచి యూస్‌మార్గ్ మీదుగా పుల్వామాలోని పఖేర్‌పోరా వైపు ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు తెలపడంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైనికాధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం వారం రోజులుగా మాటువేసినట్లు తెలిపారు. యాసిర్‌తో పాటు మరికొందరు ఉగ్రవాదులు కూడా ఉన్నారని, మిగతా వారికోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

## కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా పి.వి. మోహన్ నియామకం.. ఆదేశాలు జారీ

**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబరు 5:** కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇంచార్జిగా పి.వి మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాణిక్యం ఠాగూర్ స్థానంలో పి.వి. మోహన్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.ఇప్పటివరకు ఏపీ ఇన్‌చార్జిగా పనిచేసిన మాణిక్యం సేవలను అధిష్ఠానం కొనియాడింది. అంతేకాకుండా, కాంగ్రెస్ హై కమాండ్ ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ నూతన ఇన్‌చార్జ్‌లను, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## మెగా డీఎస్సీపై వైసీపీ దీక్ష

- తాడేపల్లిలో గురు పరిరక్షణ దీక్ష ప్రారంభం
- డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణ డిమాండ్
- మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్
- ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి
- నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటన




**రాజధాని వాయిస్ తాడేపల్లి, సెప్టెంబర్ 5 :** డీఎస్సీ-2025లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద 'గురు పరిరక్షణ దీక్ష' ప్రారంభమైంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సాయంత్రం వరకు కొనసాగే ఈ దీక్ష ద్వారా డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలపై

▶▶2



**ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు**

2

## మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి చంద్రబాబులా పారిపోం గుడివాడ అమర్నాథ్

**రాజధాని వాయిస్ తాడేపల్లి, సెప్టెంబర్ 5 :**త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ కచ్చితంగా పోటీ చేసి తీరుతు ందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తమ అధినేత జగన్ ఎప్పుడూ ఎన్నికల బరి నుంచి తప్పిం చుకునే నాయకుడు కాదని అన్నారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికలు నిర్వహించినప్పుడు చంద్రబా బు భయపడి పారిపోయారని ఎద్దేవా చేసిన ఆయన, ప్రజాస్వామ్యంలో గెలుపోటములను ప్రజల తీర్పు ద్వారానే తేల్చుకోవాల్సి ఉంటుం దన్నారు. స్థానిక పోరును ఎదుర్కొనేందుకు తమ పార్టీ అన్ని విధాలా సమరసన్నాహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఒక్కటైనప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు వణుకుతున్నాయని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి స్థానిక సమరాన్ని వాయిదా వేసేం దుకు, ఎన్నికల నుంచి తప్పించుకు నేందుకు కూటమి నేతలు దిగజారుడు యత్నా లు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని, ఈ స్థానిక ఎన్నికల ఫలితాలతో తమ అసలు రంగు బయటప డుతుందనే భయంతోనే కూటమి నాయకులు జంకుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## ఎస్సీ, ఎస్టీల రక్షణపై సమీక్ష

- ▶▶ ముఖ్యమంత్రి అధ్యక్షతన హైపవర్ కమిటీ సమావేశం
- ▶▶ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై చర్చ
- ▶▶ సంక్షేమ చర్యలపై అధికారులకు దిశానిర్దేశం
- ▶▶ రాష్ట్ర, జిల్లా స్థాయి చర్యలపై సమీక్ష



**రాజధాని వాయిస్:అమరావతి, సెప్టెంబర్ 5 :** ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన శనివారం క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్రస్థాయి హైపవర్ పర్యవేక్షక కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో ఎస్సీ, ఎస్టీలపై జరిగే అత్యాచారాలను అరికట్టేందుకు అమలు చేస్తున్న చర్యలను అధికారులు సమావేశంలో వివరించారు. అత్యాచారాల నిరోధక చట్టం సమర్థవంతంగా అమలయ్యేలా తీసుకుంటున్న చర్యలు, కేసుల దర్యాప్తు పురోగతి, బాధితులకు అందిస్తున్న సహాయంపై సమీక్ష నిర్వహించారు. చట్ట అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి ఫలితాలపై కూడా సమావేశంలో చర్చించారు. విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, గృహ నిర్మాణం, భూముల పరిరక్షణ వంటి అంశాల్లో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, దాడుల ఘటనలను తీవ్రంగా పరిగణించాలని, బాధితులకు వెంటనే న్యాయం అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అన్నారు. చట్టాల అమలుతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశానికి మంత్రులు డీబీవీ స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలకు చెందిన ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, న్యాయశాఖ అధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలులో మరింత సమర్థత సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సమావేశంలో స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లో పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు: మంత్రి నారా లోకేశ్ ప్రకటన

- విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం
- హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఏపీలో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని వెల్లడి
- వచ్చే ఏడాది ఏప్రిల్ లోపు వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలు పూర్తి
- వివాదాస్పద జీవో 117 రద్దు, పారదర్శక బదిలీలతో ఉపాధ్యాయులకు న్యాయం



**రాజధాని వాయిస్: అమరావతి, సెప్టెంబర్ 5 :** ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవ స్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029 లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని,

▶▶2

# మెగా డీఎస్సీపై వైసీపీ దీక్ష



సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2025లో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని కోరారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని దీక్షలో పాల్గొన్న నేతలు డిమాండ్ చేశారు. డీఎస్సీ ప్రక్రియలో నష్టపోయిన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి ఎమ్మెల్సీల భుజాలపై నల్ల కండువాలు వేసి దీక్షను ప్రారంభించారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కవురు శ్రీనివాస్, పి.సురేష్ బాబు, ఇసాక్ బాషా, కుంభా రవిబాబు, మొండితోక అరుణ్‌కుమార్, రామచంద్రారెడ్డి, పాలవలస విక్రాంత్, సిపాయి సుబ్రహ్మణ్యం, రూహుల్లా, కల్పలతా రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు పేర్ని నాని, కురసాల కన్నబాబు, మేకతోటి సుచరిత, తానేటి వనిత సంఘీభావం ప్రకటించారు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, దూలం నాగేశ్వరరావు, దేవినేని అవినాశ్, విజయవాడ మాజీ మేయర్ భాగ్యలక్ష్మి హాజరై మద్దతు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, మొండితోక జగన్‌తో పాటు పలువురు నియోజకవర్గ సమన్వయకర్తలు కూడా పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాలపై లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సమాధానం చెప్పాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన

**వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి**

**ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న**



**రాజధాని వాయిస్:అమరావతి, సెప్టెంబర్ 5 :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, సెప్టెంబరు 6 నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## అప్పుల బాధ తాళలేక.. గోదావరిలోకి దూకిన కుటుంబం

తణుకు : అప్పుల బాధ తాళలేక ఓ కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. తణుకుకు చెందిన నంబూరు శ్రీనివాస్, పద్మిని దంపతులు స్థానికంగా కిరాణా, పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతుండటం, అప్పుల ఒత్తిడి పెరగడంతో.. కుమారుడు (16), కుమార్తె (12)తో కలిసి దంపతులు శనివారం తెల్లవారుజామున చించినాడ బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకారు. ఈ ఘటనలో పద్మినిని జాలర్లు రక్షించగా.. శ్రీనివాస్‌తోపాటు ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. అపస్మారక స్థితిలోకి చేరిన పద్మినిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీనివాస్ సొంతూరు భీమవరంలోని మత్స్యపురి కాగా.. 20 ఏళ్ల క్రితం తణుకు వచ్చి స్థిరపడ్డారని స్థానికులు తెలిపారు. కుమారుడు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం, కుమార్తె స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలే తణుకు మండలం వేల్పూరుకు చెందిన దంపతులు అదే ప్రాంతంలో గోదావరిలోకి దూకిన ఘటనలో భర్త మృతి చెందగా, భార్య ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. పది రోజుల వ్యవధిలో మరో కుటుంబం అదే ప్రాంతంలో నదిలోకి దూకడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

# స్థానిక ఎన్నికలకు వైఎస్సార్సీపీ సన్నాహక సమావేశం

**– ఒంగోలులో జిల్లా స్థాయి సమావేశం నిర్వహణ**

**– పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేతలు**

**– ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని పిలుపు**



**రాజధాని వాయిస్: ఒంగోలు :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకాశం జిల్లా ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావు, దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గ్రామ, మండల స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం తో పాటు కార్యకర్తలతో సమన్వయం పెంచాలని నాయకులు సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలపై దృష్టి సారిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో బూత్ స్థాయి కమిటీల పాత్ర కీలకమని, ప్రతి నాయకుడు తన పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలే బలమని, వారి సహకారంతోనే విజయాన్ని సాధించగలమని నాయకులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జున రెడ్డి, ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవి, కనిగిరి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, అద్దంకి ఇంచార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్, ఒంగోలు పార్లమెంట్ పరిశీల కులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని నాయకులు పార్టీ శ్రేణులకు పిలుపుని చ్చారు. ప్రజల మద్దతుతో వైఎస్సార్సీపీని మరింత బలోపేతం చేయాలని, ఎన్నికల సమరానికి సిద్ధంగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు.

# 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు: మంత్రి నారా లోకేశ్ ప్రకటన

ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. "సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. "ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు 'ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

**గత ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వానికి తేడా ఇదే..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117 కారణంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటుకు వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసిందని, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి 'మోడల్ ప్రైమరీ స్కూల్' వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. దీని ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఈ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్లో పారదర్శకత కోసం 'లీప్ యాప్'ను తీసుకొచ్చామని, బదిలీల ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

**ప్రతి విద్యార్థి ప్రాణం విలువైందే..**

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ విషాదకర ఘటనను ప్రస్తావిస్తూ లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి పక్కన కూర్చుని మాట్లాడిన ఓ విద్యార్థిని రెండు రోజులకే ఆత్మహత్య చేసుకోవడం తనను, ముఖ్యమంత్రిని తీవ్రంగా కలచివేసిందని అన్నారు. "ప్రతి బిడ్డ ముఖ్యమే, ప్రతి ప్రాణం విలువైందే (ఎవ్రీ చైల్డ్ మ్యాటర్స్, ఎవ్రీ లైఫ్ మ్యాటర్స్). పిల్లల్లో ఏ చిన్న మార్పు కనిపించినా ఉపాధ్యాయులు గమనించాలి. వారిలో మానసిక స్థైర్యాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఫెయిల్ (FAIL) అంటే 'ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్' అని పిల్లలకు నేర్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగంపై చూపిస్తున్న శ్రద్ధను వివరిస్తూ, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యత పెంచాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను ఉదాహరణగా చూపుతూ, ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే అద్భుతాలు సృష్టించగలడని, విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలడని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు విద్యా పర్యటనలకు పంపి, అక్కడి ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

# జాతీయ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో ప్రధాని భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న 82 మంది ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల అంకితభావం, సృజనాత్మకత, నిబద్ధతను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందిం చడం, సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం ఇవ్వడం, నేర్చుకునే ప్రక్రియను మరింత ఆసక్తికరంగా మార్చడం వంటి అంశాలపై చర్చ జరిగింది. బాలల సహజమైన ప్రశ్నించే స్వభావాన్ని ప్రోత్స హించాల్సిన అవసరాన్ని ప్రధాని ప్రస్తావించారు. బాల్యాన్ని సంరక్షిస్తూ విద్యను అందించడం ఎంత ముఖ్యమో కూడా మోదీ వివరించారు. పిల్లలపై అనవసర ఒత్తిడి లేకుండా వారి సామర్థ్యా లను వెలికితీసే విధంగా బోధనా పద్ధతులు ఉండాలని సూచి ంచారు. విద్యార్థుల మానసిక, సామాజిక, భావోద్వేగ వికాసంపై కూడా దృష్టి సారించాలని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేయడం గర్వకారణమని ప్రధాని పేర్కొన్నా రు. పాఠ్యాంశాల బోధనతో పాటు విలువలు, క్రమశిక్షణ, బాధ్యతల ను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కొనియాడారు. నూతన విద్యా విధానం అమలులో ఉపాధ్యాయుల పాత్ర మరింత కీలకమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ విద్యా నాణ్యతను పెంచాలని సూచించారు. ఉపాధ్యాయుల అంకితభావం వల్లే దేశ భవిష్యత్తు బలపడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. విద్యార్థులు నేర్చుకోవడం, ఎదగడం, తమ ప్రతిభను వికసింపజేసుకోవడం కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అమూల్యమని అన్నారు. దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు.

# ఉపాధ్యాయులకు సీఎం భరోసా

**రాజధాని వాయిస్ కొడంగల్, ?** ఉపాధ్యాయులు మరో రెండేళ్ల పాటు సహకరించి ప్రభుత్వానికి వెసులుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్లతో పాటు వారి సమస్యలన్నింటినీ పరిష్కరి స్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం, రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరి స్తామని సీఎం పేర్కొన్నారు. విద్యాశాఖ మిగతా శాఖలకు ఆదర్శంగా నిలవాలని, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రెండేళ్ల సమయం ఇస్తే ఉపాధ్యాయులు అడక్కుండానే వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, తెలంగాణ విద్యా రంగ పురోగతిలో వారు కీలక పాత్ర పోషించాలని కోరారు. తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులంతా పునరంకితం కావాలని సీఎం పిలుపునిచ్చారు. ఇంట్లో సొంత పిల్లల పట్ల చూపే శ్రద్ధనే పాఠశాలల్లోని విద్యార్థుల పట్ల కూడా చూపించాలని సూచించారు. ఉపాధ్యాయులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయడం ప్రభుత్వం, రాష్ట్రానికి శుభ సూచకం కాదని పేర్కొన్నారు. పీఆర్సీ, ఇంక్రిమెంట్లు,



ఇతర సర్వీస్ అంశాల్లో ఉపాధ్యాయు లు, లెక్చరర్లకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వబోమని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని విమర్శించిన సీఎం, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీలను వివాదరహితంగా పూర్తి చేశామని చెప్పారు. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించా మని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను కల్పించామని వివరించారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి అనుభవం కల్పించేందుకు విదేశీ అధ్యయన పర్యటనలు నిర్వహించామని, విద్యా కమిషన్ ఏర్పాటు చేసి కొత్త విద్యా విధానానికి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ఆధారిత విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని సీఎం చెప్పారు. పాలిటెక్నిక్ విద్యను నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్‌లో రెండేళ్లు సిద్ధాంత విద్య, మూడో సంవత్సరం కార్పొరేట్ సంస్థల్లో శిక్షణ పొందే విధానాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులకు స్టయిఫండ్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యాలు కలిగిన యువతకు డిమాండ్ పెరుగుతోందని సీఎం పేర్కొన్నారు.

# రైతుల భూమి హక్కులకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

**- "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి**

**- రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ**



**రాజధాని వాయిస్:** నూజివీడు, సెప్టెంబర్ 05 : రైతుల భూమి హక్కులకు మరింత భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమం కింద నూజివీడు నియోజ కవర్గంలోని చాట్రాయి మండలం చిత్తాపూర్ గ్రామంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ రైతు భూమిపై హక్కు శాశ్వతం గా భద్రంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందన్నారు. భూ యాజమాన్యానికి సంబంధించిన రికార్డులను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు పూర్తి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల ఆత్మగౌరవానికి భూమి ప్రధాన ఆధారమని పేర్కొన్న మంత్రి, భూమి హక్కుల విషయంలో ఎలాంటి సందేహాలు లేకుండా స్పష్టమైన ధ్రువపత్రాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులు రైతుల హక్కులకు మరింత బలాన్ని చేకూరుస్తాయని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి వివరించారు. భూ వివాదాల పరిష్కారం, రికార్డుల నవీకరణ, రైతుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తోందని ఆయన పేర్కొన్నారు. భూమి హక్కుల పరిరక్షణ ద్వారా రైతులకు మరింత భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాదారు పాస్‌బుక్కులు అందుకున్న రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ కార్యక్రమం తమ భూమి హక్కులకు మరింత రక్షణ కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ సత్కారం

- నరసరావుపేటలో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం
- విద్యా రంగంలో సేవలను కొనియాడిన కలెక్టర్
- 74 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు






**రాజధాని వాయిస్ నరసరావుపేట, సెప్టెంబర్ 5 :** పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని టౌన్ హాల్‌లో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఐఏఎస్ ముఖ్య అతిథి గా హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. విద్యా రంగ అభివృ ద్ధిలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను ఆమె కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల కృషి అమూల్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా 13 మంది ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎంలు), 24 మంది స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏలు), 35 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు), 2 మంది జూనియర్ లెక్చరర్లు (జేఎల్‌లు) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయులు కేవలం పాఠా లు చెప్పేవారే కాకుండా సమాజ నిర్మాణ శిల్పులని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావన పెంపొందించడంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందని తెలిపారు.విద్యా ప్రమాణాల పెంపు కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయుల సహకారం అవసరమని అన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను సహచరులు అభినందించారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి

# జెన్-జెడ్‌తో మమేకమైన ఎమ్మెల్యే

- గీతాంజలి ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులతో ముఖాముఖి
- ఉద్యోగాలు, ఏఐ, రాజకీయాలపై చర్చ
- నూతన హాస్టల్ భవన ప్రారంభం
- యువత ఆలోచనలు స్ఫూర్తిదాయకమన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**రాజధాని వాయిస్ నెల్లూరు, సెప్టెంబర్ 5 :** నెల్లూరు జిల్లా గంగవరంలోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విద్యార్థులతో ప్రత్యేకంగా మమేకమయ్యారు. జెన్–జెడ్ యువతతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఉద్యోగాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), రాజకీయాలు, సోషల్ మీడియా, భవిష్యత్తు అవకాశాలు వంటి పలు అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలు, వ్యక్తపరిచిన అభిప్రాయాలు తనను ఆలోచింపజేశాయని ఎమ్మెల్యే తెలిపారు. యువతతో మాట్లాడటం కంటే వారి ఆలోచనలను వినడంలోనే ఎక్కువ సంతృప్తి కలిగిందన్నారు. నేటి తరం యువతలో ఉన్న స్పష్టత, భవిష్యత్తుపై ఉన్న దృక్పథం ఆశాజ నకంగా ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల కలలు, లక్ష్యాలు రేపటి సమాజ నిర్మాణానికి పునాది వేస్తాయని ప్రశాంతిరెడ్డి అన్నారు. యువతలో ఉన్న సృజనాత్మకత, కొత్త ఆలోచనలు దేశాభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అదే సందర్భంగా గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ హాస్టల్‌ను నిర్మించినట్లు తెలిపారు. విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణం కల్పించడంలో ఈ వసతి గృహం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.హాస్టల్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సదుపాయాలు కల్పించాలని యాజమాన్యానికి సూచిం చారు. నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన వసతి కూడా విద్యార్థుల అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు చూపిన ఆత్మీయతకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. యువతలో కనిపించిన ఉత్సాహం, సానుకూల దృక్పథం తనకు మరింత ప్రేరణనిచ్చిందన్నారు. భవిష్యత్తులో కూడా యువత తో ఇలాంటి కార్యక్రమాల ద్వారా నిరంతరం మమేకమవుతానని తెలిపారు.

# గణేష్ ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి



- మండపాల ఏర్పాటుకు చలానాలు అవసరం లేదు
- సింగిల్ విండో విధానంలో అన్ని శాఖల అనుమతులు
- భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలని ఎస్పీ పిలుపు

**రాజధాని వాయిస్ శ్రీకాకుళం,** ఈ నెల 14న నిర్వహిం చనున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో గణేష్ మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అమలు చేస్తున్న సింగిల్ విండో విధానం ద్వారా పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అనుమతుల ను ఒకే వేదికపై పొందవచ్చని తెలిపారు.నిర్వాహకులు తప్పనిసరి గా ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసిన మండపాలకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ ఎన్‌ఓసీ జారీ చేయబడుతుందని వివరించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు లేదా ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజలు లేదా నిర్వాహకులు ఎవరైనా అనవసరంగా డబ్బులు చెల్లించవద్దని, అలాంటి డిమాండ్లు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాల సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు. మండపాలను రహదారులపై ట్రాఫిక్ కు ఆటంకం కలగకుండా ఏర్పాటు చేయాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, నీటి డ్రమ్ములు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ అలంకరణలో నాణ్యమైన బీఐఎస్, ఐఎస్ఐ ప్రమాణాల పరికరాలనే వినియోగించాలని, ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేం దుకు అధిక శబ్దం చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు ఎస్పీ తెలిపారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, అశ్లీల ప్రదర్శనలు నిర్వహించడం వంటి చర్యలు పూర్తిగా నిషేధితమని హెచ్చరించారు. హుండీలు, విరాళాలు, విలువైన వస్తువుల భద్రత విషయంలో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిం చారు.నిమజ్జన కార్యక్రమాల నిర్వహణలో కూడా కట్టుదిట్టమైన నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిమజ్జన వాహనాల వివరాలు, డ్రైవర్ల లైసెన్స్ వివరాలు ముందుగానే సమర్పించాలని చెప్పారు. పోలీసు శాఖ సూచించిన మార్గాల్లోనే నిమజ్జన ఊరేగింపులు నిర్వహించాలని, నిర్ణీత సమయాల్లోనే కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. రాత్రి 10 గంటలలోపు నిమజ్జనాలు ముగించాల్సి ఉంటుందని, నిమజ్జన ప్రాంతాల్లో చిన్నపిల్లలను అనుమతించవద్దని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలు, పర్యావరణహిత గణేష్ విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రతి గణేష్ మండపానికి సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్ కో–ఆర్డినేటర్‌ను నియమించి నిర్వాహకులతో సమన్వయం చేస్తామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే డయల్ 112 లేదా వాట్సాప్ నంబర్ 630999 0933 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యల స్వీకరణ

- రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో ప్రజా దర్బార్
- ప్రజల వినతులు స్వీకరించిన మంత్రులు
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



**రాజధాని వాయిస్: రాయచోటి, సెప్టెంబర్ 05 :** అన్నమయ్య జిల్లా రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహచర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరిస్తూ ప్రతి సమస్యను శ్రద్ధగా విని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్‌లో భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, గృహ నిర్మాణాలు, తాగునీటి సదుపాయాలు, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సమస్యలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన అనేక వినతులు వచ్చాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకోవడం ద్వారా వాటికి వేగవంతమైన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రులు తెలిపారు. ప్రజల అభ్యర్థనలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమం సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి ప్రజల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. నిబంధనల మేరకు పరిష్కరించగల అంశాలపై ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలకు ప్రభుత్వమే ముందుకొచ్చి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే పరిపాలనను తీసుకెళ్లాలనే సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి అర్హత ఉన్న ప్రతి సమస్యకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల అవసరాలు, అభ్యర్థనలను తెలుసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారం చూపే వరకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, పారదర్శకమైన పాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు
- ప్రత్యేక భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి
- పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి




**రాజధాని వాయిస్: తిరుపతి, సెప్టెంబర్ 05 :** తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆలయ పరిసరాలు, ప్రధాన కూడళ్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తూ భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయడంతో పాటు పార్కింగ్ సదుపాయాలను విస్తరించే చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు విధులు నిర్వహించి రద్దీని తగ్గించేలా చర్యలు తీసుకోను న్నాయి. సీసీ కెమెరాల ద్వారా కీలక ప్రాంతాలన్నింటినీ పర్యవేక్షిం చడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. బాంబు నిర్వీర్య దళాలు, డాగ్ స్క్వాడ్లు, ప్రత్యేక తనిఖీ బృందాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ భద్రతా చర్యలను పర్యవేక్షించనున్నాయి.భక్తులు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, అనుమానా స్పద పరిస్థితులు కనిపించిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితు ల్లో తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలు, సమాచార వ్యవస్థలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా, శాంతియు తంగా నిర్వహించేందుకు భక్తులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు కోరారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి స్వామివారి దర్శనాన్ని సాఫీగా పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ తాగునీటి భద్రతకు వేగం.. 340 ఫిల్టర్ బెడ్ల పునరుద్ధరణ



**రాజధాని వాయిస్: అమరావతి, సెప్టెంబర్ 05 :** గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ విస్తృత స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ తాగునీటి పథకాల బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టగా, రూ.35 కోట్ల వ్యయంతో దాదాపు 370 గ్రామాల పరిధిలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాల్లో పాడైన 340 ఫిల్టర్ బెడ్లను పునరుద్ధరించారు. దీంతో సుమారు 25 లక్షల మందికి నాణ్యమైన తాగునీటి సరఫరా అందుతోంది.గ్రామీణ తాగునీటి వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు జల్ జీవన్ మిషన్––అమరజీవి జలధార పథకాల కింద దాదాపు రూ.26 వేల కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.7,910 కోట్లతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల ద్వారా రాబోయే 30 ఏళ్లలో 1.21 కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందించారు. అదనంగా మరో పది మల్టీవిలేజ్ స్కీంలకు రూ.9,355 కోట్లు మంజూరు చేశారు.నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న మూడు వేల గ్రామాలను గుర్తించి రూ.1,814 కోట్లతో సింగిల్ విలేజ్ వాటర్ స్కీంల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అలాగే గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పులివెందుల, డోన్, ఉద్దానం తదితర తాగునీటి పథకాల పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. గ్రామీణ తాగునీటి వ్యవస్థల క్రమబద్ధీకరణ, విస్తరణ కోసం 7,439 పనులకు రూ.4,054 కోట్ల కేటాయింపులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.గ్రామీణ నీటి సరఫరా శాఖ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అనేక గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లు దెబ్బతిని నీటి నాణ్యత తగ్గిపోయిందని, రంగు మారిన నీరు సరఫరా కావడం, శుద్ధి వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థలపై సమగ్ర పరిశీలన నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రత, స్థానిక అవసరాలు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా యుద్ధప్రాతి పదికన ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టారు.నీటి శుద్ధి ప్రక్రియలో ఫిల్టర్ బెడ్లు అత్యంత కీలకమని, నీటిలోని సూక్ష్మ మలినాలను తొలగించి సురక్షితమైన తాగునీటిని అందించడంలో అవి ప్రధాన పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, తాగునీటి వ్యవస్థల బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలను కొనసాగిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## కెఎన్ఆర్ విద్యా సంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**పిడుగురాళ్ళ.సెప్టెంబరు 05, రాజధాని వాయిస్:** పిడుగురాళ్ల పట్టణం,రాజుపాలెం మండలం కొండమోడు కె.ఎన్.ఆర్ విద్యాసంస్థలనందు మాజీ రాష్ట్రపతి భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు బాడిస మస్తాన్ రావు మాట్లాడుతూ, ఉపాధ్యా యులు మనకు కేవలం పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే బోధించరని, మంచి నడవడి, క్రమశిక్షణ, బాధ్యత, కష్టపడే తత్వం వంటి జీవిత విలువలను కూడా నేర్పిస్తారు. మన భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు.మన విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రేమతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా ఎంతో ముఖ్యమైనది. అందుకే ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించాలని,గురువు లేని విద్య చీకటిలో ప్రయాణం వంటిది అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చిన్నబోయిన శ్రీనివాసరావు, సాధినేని నరసింహారావు, తెలకపల్లి గోపికృష్ణ, దీపంగి సురేష్, బి. యాకోబు, వంగివరపు రాజా,జె. వీరాంజనేయులు కోనేటి ప్రసన్న, బి.ఇందు పాల్గొన్నారు.

## సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం



**కారంపూడి.సెప్టెంబర్ 05రాజదాని వాయిస్ :**పట్టణంలోని టీచర్స్ డే సందర్భంగా బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజ మహోత్సవం నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయు లకు గురువులకు దృశ్యాలవాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు శేషి రెడ్డి, సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తలు కొల్లిపర వెంకట సుబ్బారావు, వెచ్చ వరలక్ష్మణరావు, తుమ్మేపల్లి నాగేశ్వరరావు, ఎస్ పి ఆర్ కృష్ణ, గణిత అమరయ్య , వెచ్చ వాసు మరియు మహిళా సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి ఏడుగురి అరెస్ట్



**దుర్గి. సెప్టెంబర్ 05రాజధాని వాయిస్ :**మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్ఐ బి. గోపాల్ తన సిబ్బందితో కలిసి ఈ దాడి చేపట్టారు.ఈ తనిఖీల్లో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,750 నగదుతో పాటు 6 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.గ్రామాల్లో ఎవరైనా జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఇలాంటి అక్రమాల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని ఎస్ఐ గోపాల్ ప్రజలను కోరారు.

### గురు పరిరక్షణ దీక్షా కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల



**నరసరావుపేట సెప్టెంబర్ 05రాజధాని వాయిస్ :** దగా డీఎస్సీలో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తూ తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీలు గురు పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఈ గురు పరిరక్షణ దీక్షా కార్యక్రమంలో శనివారం కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొన్నారు.

## జీవశాస్త్ర ఉపాధ్యాయినీ మాడెబోయిన విజయ పద్మకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినీ అవార్డు ప్రధానం

**వెల్దుర్తి. సెప్టెంబర్ 05 రాజధాని వాయిస్ :**గత 26 సంవత్సరాలుగా జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా అంకితభావంతో సేవలందిస్తున్న జడ్పీ హెచ్ ఎస్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల) వెల్దుర్తి పాఠశాల ఉపాధ్యాయిని మాడెబోయిన విజయ పద్మ కి పల్నాడు జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మక జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును ప్రధానం చేసింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రభుత్వ విప్ మరియు వినుకొండ ఎమ్మెల్యే జీ.వి. ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు జీవశాస్త్రాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధించడంలో ఆమె చేస్తున్న విశిష్ట కృషిని ఈ సందర్భంగా అతిథులు ప్రత్యేకంగా కొనియాడారు.అవార్డు లభించడం పట్ల విజయ పద్మ హర్షం వ్యక్తం చేస్తూ తనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ప్రధానోపాధ్యాయులు కొమ్ము కిషోర్ కి, తోటి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుమార్తెకు ఈ ఘనత లభించడం పట్ల ఆమె తల్లిదండ్రులు మాడెబోయిన గోపయ్య, వరలక్ష్మి, కుటుంబ సభ్యులు మరియు వెల్దుర్తి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## దోమలు నివారణకు మలాథిన్ 25% మందు పిచికారీ

### పల్నాడు జిల్లా మలేరియా అధికారి నజీర్

**రాజధాని వాయిస్.సెప్టెంబర్ 05దుర్గి.**మండలం అడిగొప్పుల గ్రామంలోని చెంచు జనాభా గల కాలనీలో శనివారం మలేరియా నివారణ చర్య ల్లో భాగంగా ప్రతి ఇంటిలో మలాథి న్ 25%మందును పిచికారీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు అడి గొప్పుల గ్రామంలో జరుగుతున్నఐ.ఆర్.ఎస్. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజిల్లా మలేరియా అధికారి నజీర్ మాట్లాడుతూ,దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాప్తి చెంద కుండా పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. ముఖ్యంగా రాత్రి వే ళల్లో దోమతెరలను విని యోగించాలని ఆయనకోరారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెంచు కాలనీల్లో దశలవారీగా మందు పిచికారీ చేపడతామని అధికారులు తెలిపారు. ప్రజలు ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించి మలేరియా, డెంగీ నివా రణకు చర్యలు తీసుకో వాలని దుర్గి పి హెచ్ సి. డా. భాను ప్రకాష్ పిలుపునిచ్చారు.ప్రతి ఇంట్లో మందు పిచికారీ చేయించు కుంటే



దోమకాటు నుండి 3నెలలు రక్షణ పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భాను ప్రకాష్‌తో పాటు ఆరోగ్య శాఖకు చెందిన అధికారులుహెల్త్ ఎడ్యుకేటర్.వి.శ్రీనివాస రావు,,సూపర్ వైజర్ నాగేశ్వరావు,సిబ్బంది భాషా, సద్గురు, ఏ.యన్. యంలు. ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కారంపూడి.సెప్టెంబర్ 05రాజదాని వాయిస్ :**మండలంలో స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ మర్రి అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మూర్తి చిత్రపటానికి పూలదండ సమర్పించి దీపప్రజ్వలన అనంతరం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ మూర్తి పుట్టినరోజు సెప్టెంబర్ 5న గురువులు అందరిని పూజించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రపంచంలో గురువు లేకుండా ఎలాంటి విద్య మనం కొనసాగించలేమని మొదట గురువు అమ్మ అయితే మనకు బాధ్యతలను భవిష్యత్తును పరిచయం చేసే మన గురువులు కొవ్వొత్తుల కరిగిపోయిన మన జీవితంలో వెలుగు నింపాలని కృషి చేస్తారు. అని ఈ సందర్భంగా ప్రతి ఉపాధ్యాయులను సన్మానించి వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ బినోమ మాట్లాడుతూ, సమాజంలో ముందుకు విద్యతోనే సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థు




లు ఉపాధ్యాయులని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు ఆట పోటీలు నిర్వహించటం జరిగింది. గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శన, నాటకాలు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలో నిర్వహించారు నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో విద్య భవన్ సుపీరియర్ సిస్టర్ మర్షియమ్మ తల్లిదండ్రులుమరియు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులో అమరావతి నిర్మాణాలు పూర్తి చేయాలి

### ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి ఆదేశం

**తుళ్లూరు సెప్టెంబర్ 05 రాజధాని వాయిస్** రాజధాని అమరావతిలో చేపడుతున్న ట్రంక్ రహదారులు, ఎల్పీఎస్ జోన్ల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి అధికారులను ఆదేశించారు.శనివారం ఆమె రాజధాని ప్రాంతంలో ఏడీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉండవల్లి, పెనుమాక గ్రామాల వద్ద కొండవీటివాగులో 3.75 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న వరద నియంత్రణ పనులను పరిశీలించారు. రానున్న వారం రోజుల్లో పనుల్లో 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని చీఫ్ ఇంజినీర్ బి.నరసింహమూర్తిని ఆదేశించారు. అనంతరం వెలగపూడి నుంచి అనంతవరం వరకు నిర్మాణంలో ఉన్న ఈ-6 రహదారిని పరిశీలిం చారు. ఇది వీఐపీ మార్గం కావడంతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనుసంధాన రహదారుల నిర్మాణం లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్-9 రహదారిలో నిర్మిస్తున్న సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లను



పరిశీలించిన సీఎండీ, పనుల నాణ్యత, పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు.రాజధాని రైతులకు అభివృద్ధి చేసి అందిస్తున్న ఎల్పీఎస్ లేఅవుట్ల నిర్మాణ పనులను కూడా ఆమె పరిశీలించారు. ముఖ్యంగా జోన్-9లోని బ్లాక్-6, జోన్-5సీలోని బ్లాక్-4లో జరుగుతున్న పనులను పరిశీలి ంచారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణ పనుల పురోగతిని చీఫ్ ఇంజినీ ర్ సీహెచ్.ధనుంజయ సీఎండీకి వివరించారు.ఈ పర్యటనలో ఏడీసీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**పెదకూరపాడు సెప్టెంబర్ 05 రాజధాని వాయిస్** భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సమాజానికి జ్ఞానాన్ని అందిస్తూ భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని నాయకులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందిం చడంలో వారు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియా డారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

**విద్యారంగానికి అధిక ప్రాధాన్యం**

కూటమి ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## అనారోగ్య బాధితులకు సిఎంఆర్ఎఫ్ భరోసా

### రూ.12.04 లక్షల విలువైన చెక్కుల పంపిణీ



**పెదకూరపాడు సెప్టెంబర్ 05 రాజధాని వాయిస్ :** అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారి కార్యాలయంలో శుక్రవారం పెదకూరపాడు, అమరావతి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులు పంపిణీ చేశారు.పెదకూరపాడు, అమరావతి మండలాల్లో అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు మంజూరైన రూ.12,04,189 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వైద్య చికిత్స కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న పేదలకు సిఎంఆర్ఎఫ్ ఆర్థికంగా ఎంతో భరోసా కల్పిస్తోందని నాయకులు తెలిపారు.పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆర్థిక సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## ఆర్థిక నేరస్తులను అరెస్ట్ చేయడంలో ప్రభుత్వాలు విఫలం

### పిఎం గారు నిత్యానంద నుఇప్పుడైనా అరెస్ట్ చేయండి... భారత హేతువాద సంఘం డిమాండ్



**సెప్టెంబర్ 05 రాజధాని వాయిస్ మంగళగిరి** ఆర్థిక నేరస్తులను పట్టుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయనిభారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు.నేరస్తులను పట్టుకోవటంచేతకా కపోవటం వలనచాలామంది ఆర్థిక నేరస్తులు ప్రజాధనం లూటీ చేసి ఇతరదేశాలకు మకాం పెడుతున్నారని ఆయన విమర్శించారు.ఆదేశం చట్టాలకు లోబడి ఈ నేరస్తులను మనదేశానికి తీసుకరావటము మనవాళ్ళు చేయలేక పోవటం ఆర్థికనేరస్తులు , అత్యాచారము , హత్యలు చేసినవాళ్లు ఇతర దేశాలకు పారిపోతున్నార న్నారు.అలాంటి వారిలో నిత్యానంద స్వామి ఒకడు.గతంలో కొన్ని కేసుల్లో అరెస్ట్ కాబడ్డాడు.అయితే ఒక మైనర్ బాలికను రేప్ చేసిన కేసులో అరెస్ట్ కాబడకుండా , దేశం నుండి పారిపోయి ఒక చిన్న ద్వీపానికిచేరుకున్నారు. అది ఒక ప్రత్యేక దేశంగా సృష్టించుకొని , అక్కడే కొంతకాలం నుండి ఉంటున్నారు.మన ప్రభుత్వానికి అరెస్ట్ చెయ్యటం చేత కాలేదు.ప్రస్తుతం ఈనిత్యానంద పాండిచ్చేరి లో ఒక్క కార్యక్రమానికి వస్తున్నట్లు , అక్కడ ఈయనకు రక్షణ కల్పించాలని ఆయన శిష్యులు కోరినట్లు వార్తలు వస్తున్నాయనినార్నె తెలిపారు. ఇపుడైనా ఆ నేరస్తుడిని అరెస్ట్ చేస్తారా ఎందుకంటే ఆరాష్ట్రం కేంద్రపాలిత రాష్ట్రం. ఆ ప్రాంతం దొంగబాబాల దేశంగా ముద్ర పడిపోయింది.అందువలన వదిలేస్తారా ...మోడీ గారు ఇంతకంటే నిత్యానందను అరెస్ట్ చెయ్యటానికి ఛాన్స్ దొరకదు.అరెస్టు చేయాలని నార్నె వెంకటసుబ్బయ్య ఆ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

## సర్వేపల్లి ఆశయాలను ఆదర్శప్రాయం...

### కెఎల్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ.పవన్ కుమార్



**మంగళగిరి సెప్టెంబర్ 05 రాజధాని వాయిస్** మహోన్నత విద్యావేత్త, దార్శనికులు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను నేటి ఉపాధ్యా యులు, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కెఎల్ యూనివర్శిటీ ఇంఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యూనివర్శిటీలోని హాబీక్లబ్స్ ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యా యులు కేవలం విద్యను బోధించటమే కాకుండా విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, నైతికత, సామాజిక బాధ్యతలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రోవైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ఇంఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ టికె.రామకృష్ణారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, హాబీక్లబ్స్ ప్రొఫెసర్ ఇంఛార్జి డాక్టర్ ఆర్.శుభాకరరాజు పలువురు అధ్యాపకు లు తదితరులు నివాళులర్పించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com